ప్రజాశక్తి

సోమవారం 20 నవంబర్ 2023 | 5 | పార్వతీపురం మన్యం

తలవరం విద్యార్థికి కాంస్యం

పతకం సాధించిన గోవింద్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి.గోవింద్‌కు రాష్ట్రస్థాయి పాఠశాలల పోటీల్లో కాంస్య పతకం లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు ఆదివారం తెలిపారు. ఈనెల 15, 17 తేదీల్లో ఎస్ నంద్యాల జిల్లాలోని పిజి హైస్కూల్ అండర్-17 విభాగంలో ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో గెలుపొందడంతో ఈపతకం లభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సిహెచ్ మధుసూదనరావు, వ్యాయమ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, వై.ధనలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నత్తనడకన నాడు-నేడు

తుప్పుపట్టేందుకు సిద్ధంగా ఉన్న ఇనుము

షెడ్డులో నడుస్తున్న పాఠశాల

నాడు-నేడు ద్వారా పనులు చేపట్టి పాఠశాలల రూపు రేఖలు మార్చుతున్నట్లు ప్రభుత్వం అట్టహాసంగా ప్రచారం చేస్తోంది. అయితే పలుచోట్ల చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో ఈ పాఠశాలల రూపురేఖలు అధ్వానంగా ఉన్నాయన్నది గిరిజనుల మాట. కాంట్రాక్ట్ విధానానికి చరమగీతం పాడి స్కూల్ కమిటీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించినప్పటికీ పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో విద్యా కమిటీలకు అందకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలుచోట్ల నాడు నేడు పనుల పరిస్థితి పేరు గొప్ప ఊరు దెబ్బ అన్న చందంగా తయారైందన్న అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాక్ష్యాతూ డిప్యూటీ సిఎం ఇలాకాలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు.

- తుప్పపట్టబోతున్న ఇనుము
- కప్పబడిన గుంతలు...
- చోరీకి గురవుతున్న ముడిసరుకు
- డిప్యూటీ సిఎం ఇలాకాలో దుస్థితి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలోని కె.పెద్దవలస ప్రాథమిక పాఠశాల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసే ఈ పాఠశాలకు నాడు-నేడు నిధులు మంజూరు కావడంతో పాత భవనాన్ని తొలగించారు. సుమారు 52 మంది విద్యార్థులకు స్థానికులు ఏర్పాటు చేసే షెడ్డులోనే విద్యను అందజేస్తున్నారు. నాడు - నేడు పనుల కింద భవన నిర్మాణానికి సుమారు రూ.37లక్షలు మంజూరయ్యాయి. తొలిత విడుదలైన నిధులు వెనక్కి వెళ్లిపోగా మళ్లీ ఈ ఏడాది మార్చిలో రూ.లక్షా78వేలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో సుమారు రూ.లక్షా76వేలు ఖర్చు చేసి భవన నిర్మాణానికి అవసరమైన ఇనుము, రాయి, ఇసుక వంటి ముడి సరుకులు తీసుకొచ్చారు. అలాగే ఫిల్లర్ల నిర్మాణానికి గోతులు కూడా తవ్వేశారు. అయితే చాలాకాలం అవుతున్నప్పటికీ నిర్మాణానికి సంబంధించిన మిగతా నిధులకు అనుమతులు రాకపోవడంతో గతంలో తెచ్చిన ముడి సరుకు అలాగే ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రాత్రి వేళల్లో ముడి సరుకులు దొంగలు పట్టుకుపోతున్నారు. ఇనుము తుప్పుపడుతోంది. ఫిల్లర్ల కోసం తీసిన గోతులు కూడా కప్పుబడిపోయాయని స్థానికులు అంటున్నారు. భవన నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతారో తెలియని దుస్థితి ఏర్పడింది. ఫిల్లర్ల కోసం తీసిన గోతులు వైపు పిల్లలు వెళ్తే ప్రమాదమని అడ్డంగా కంచి పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి వెంటనే పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

డిప్యూటీ సిఎం ఇలాకాలోనే..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్న దొర స్వగ్రామం పక్కనే కె.పెద్దవలస. ఈ పాఠశాల సమస్యపై కూడా పలుమార్లు డిప్యూటీ సిఎం దృష్టి వివిధ సందర్భాల్లో గ్రామస్తులు, జనసేన కార్యకర్తలు తీసుకువెళ్లారు. అయినా ఇప్పటికీ ఈ పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రత్యేక దృష్టి సారించి పాఠశాల నిర్మాణానికి కృషి చేయాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు

అమ్మవారి పండగ తేదీలను ప్రకటిస్తున్న ఆలయ ఇఒ, ఉత్సవ కమిటీ సభ్యులు

జనవరి 22, 23, 24 తేదీల్లో పోలమాంబ జాతర

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో వేంచేసిన గిరిజన ఆరాధ్య దేవత పోలమాంబ అమ్మవారి జాతర జనవరి 22న తోలేళ్లు, 23న సిరిమాను, 24న అంపక ఉత్సవాలను జరపనున్నట్లు దేవాదాయ శాఖ ఇఒ వివిఎస్ నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక చదురుగుడిలో ధర్మకర్తల మండలితో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. జాతర తొలి ఘట్టమైన పెద్దపోలమ్మ సనప చాటింపు డిసెంబర్ 18న ప్రారంభమవుతుందన్నారు. వచ్చే ఏడాది మార్చి 26 వరకు పది వారాల పాటు జాతర కొనసాగుతుందని తెలిపారు. చండీ హెూమం, మహా అన్నదానంతో జాతర ముగుస్తుందని వెల్లడించారు. అమ్మవారి జాతర ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పూడి దాలినాయుడు, ధర్మకర్తలు అల్లు తిరుపతినాయుడు, పుర్రు చిన్నారావు, యేగిరెడ్డి రాములమ్మ, గొంగాడ వెంకటరమణమ్మ, ఎంపిటిసి సభ్యులు తీళ్ల పోలినాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, మాజీ చైర్మన్లు గంజి కాశీనాయుడు, వి.భాస్కరరావు, తీళ్ల శ్రీరాములు, గిరడ శ్రీనివాసరావు, సివున్నాయుడు, కుప్పులి రాజగోపాల్, సేవకులు ఆలయ ఆశాదీలు, చొక్కాపు బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎస్‌లో అత్యుత్తమ బోధన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సైనిక స్కూల్లో చేరాలనుకునే విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధన అందిస్తామని ఎస్‌జిఎస్ సైనిక అకాడమీ డైరెక్టర్ ఎం.రామ్ తెలిపారు. ఆదివారం నగరంలో నూతనంగా ప్రారంభించిన అకాడమీలో విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. అకాడమీ ద్వారా అందిస్తున్న విద్యా బోధన తీరు, వసతి సౌకర్యాల గురించి ఆయన వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తిచేశారు.

పార్వతీపురం పట్టణంలోని బందం వీరి వీధులో ఏర్పాటు చేసిన ఎల్ఒడి స్క్రీన్‌పై భారత్- ఆసీస్ మధ్య జరిగిన ఫైల్ మ్యాన్‌ను తలకిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పట్టణ ప్రముఖులు, యువత, చిన్నారులు -పార్వతీపురం, రూరల్

27, 28న కార్మిక, రైతు మహా ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన కార్మిక, రైతు మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల అధ్యక్షులు లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంజరాపు సత్యంనాయడు మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ రైతు సంఘాల పిలుపుమేరకు విజయవాడలో ఈనెల 27,28 తేదీల్లో జింఖాన్ మైదానంలో జరిగే కార్మిక రైతు మహా ధర్నాకు రైతులు, కార్మికులు కదిలి రావాలని కోరారు. కార్మికులకు, రైతులకు, ప్రజలకు వ్యతిరేకమైన వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తుందని, ఇటువంటి ప్రభుత్వాన్ని అధికారం నుండి దింపటమే మార్గం అని అన్నారు. కొత్తగా కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి భయపడే స్థాయిలో కార్మిక, రైతు ఐక్య పోరాటాలు పెరగాలని పిలుపునిచ్చారు. ఈ దిశలో విజయవాడ మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నియంత్రించాలని, ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జిఎస్టి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌పై ఎక్సైజ్ పన్నులు గణనీయంగా తగ్గించాలని, రైల్వే రాయితీలు పునరుద్ధరించాలని, పాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. ప్రజా పంపిణీ పథకాన్ని విస్తతం చేసి ఆహార భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, లీజు విధానం రద్దు చేయాలని,విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను ఆపాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు 200రోజుకు పెంచి, రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం తదితర స్కీం వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం, పెన్షన్, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమం అమలు చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన కార్మికులు, రైతులు ఐక్యపోరాటాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, ఇందిర, శ్రీదేవి, కృష్ణవేణి, ప్రసాదు, సావిత్రి, పోలమ్మ స్వర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం కావడం, అందులో కార్తీకమాసం ప్రారంభం కావడంతో పర్యాటకులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుండి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకలు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువత జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నీటి మీద యువతీ యువకులు నడిచి వెళ్లారు. సైకిల్ ఎక్కి ఆకాశంలో ఒక సన్నటి తీగపై సైకిల్పై తొక్కుతూ చక్కెర్లు కట్టారు. ఆల్ ట్రైన్ వెహికల్ ఎక్కి పార్కు చుట్టుముట్టారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆనందంగా గడిపారు. వాటర్ రోలర్లు గుండ్రంగా తిరిగారు. కమాండ్ నెట్ ఎక్కి చిన్నారులు ఆటలాడారు. ఆనంద్ విహార్ వద్ద డాన్సులు వేసి ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. అనంతరం ఆడాలి యూ పాయింట్‌ను సందర్శించి అందాలను కనువిందు చేసుకున్నారు మెట్టు గూడ జలపాతాన్ని సందర్శించి జలకలాడారు.

పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

సమావేశంలో మాట్లాడుతున్న విఆర్‌ఒల సంఘం నాయకులు

విఆర్‌ఒల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా వ్యాప్తంగా విఆర్‌ఒలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులు మరడ సింహాచలం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలో జరిగిన ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బెహరా మురళీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్లను అప్‌గ్రేడ్ చేయాలని, గ్రేడ్-2 గ్రామరెవెన్యూ అధికారులను గ్రేడ్-1గా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ 166 జివో అమలు చేయాలని కోరారు. సర్వే ట్రైనింగ్ విడతలవారీగా అందరి విఆర్‌ఒలకు నిర్వహించి ఫలితాలు వెంటనే ప్రకటించాలని, సర్వే శిక్షణను క్షేత్రస్థాయిలో నిర్వహించాలని కోరారు. విఆర్‌ఒలు రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి కార్యాచరణ నిర్ణయించేందుకు విస్తృత సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బి.రాజా, ఉపాధ్యక్షులు కె.రామచంద్ర నాయుడు, డివిజన్ అధ్యక్షులు ఎస్ పురుషోత్తంనాయుడు, కోట శ్రీనివాసరావు, బురిడి సింహాచలం పాల్గొన్నారు.

ఎంపిడిఒ మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మండల పరిషత్ అధికారి వివి శివరామప్ప (60) గుండెపోటుతో ఆదివారం ఆకస్మికంగా మృతిచెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తమ సంతాపాన్ని తెలిపారు. సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు, తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పిటిసి జి.సుజాత, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిసార్, మండలంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతికి గురై ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : కురుపాం ఎంపిడిఒ శివరామప్ప మృతి బాధాకరమని స్థానిక ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహశీల్దార్ రాములమ్మ అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన తోటి ఉద్యోగిని కోల్పోయామన్నారు.

నేడు వడ్డంగిలో గడపగడపకు..

ప్రజాశక్తి - భామని

మండలంలోని వడ్డంగి సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే విశ్వాసారాయి కళావతి ఆధ్వర్యంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నామని వైసిపి కన్వీనర్ తోట సింహాచలం తెలిపారు. మనుమకొండలోని అక్షర బ్రహ్మ ఆలయంలో వై నీడ్స్ జగన్ కార్యక్రమం, పట్టాలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పర్యాటక పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

పర్యాటక అధికారి ఎన్ నారాయణ రావు

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ పర్యాటక పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్యాటక అధికారి ఎన్ నారాయణరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ గ్రామీణ పర్యాటకం, గ్రామీణ ప్రాంతాల్లో బస విభాగం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని చెప్పారు. సంబంధిత రంగాల్లో అనుభవం, ఆసక్తి గల సంస్థలు www. rural.tourism. gov.in వెబ్ సైట్‌లో వివరాలకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఉత్తమ గ్రామీణ హెూమ్‌స్టే పోటీ 2024గా పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పెంపొందించడానికి, పర్యాటక లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు దృష్టి పెట్టిందని అన్నారు. ఈ పోటీలు గ్రామాల మధ్య పోటీతత్వం, గర్వాన్ని మరింతగా పెంచడానికి ప్రయత్నిస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి, పర్యాటకం ద్వారా సాంస్కృతిక, సహజ వారసత్వాన్ని కాపాడ్డానికి నిబద్ధతతో గ్రామాలను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. గ్రామాల గుర్తింపు ఇతర గ్రామాల మధ్య ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఒక ఆదర్శప్రాయమైన నమూనాగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఏప రంగాల్లో

- ఉత్తమ పర్యాటక గ్రామాలు - వారసత్వం,
- ఉత్తమ పర్యాటక గ్రామాలు - వ్యవసాయ పర్యాటకం,
- ఉత్తమ పర్యాటక గ్రామాలు - క్రాఫ్ట్,
- ఉత్తమ పర్యాటక గ్రామాలు - బాధ్యతాయుతమైన పర్యాటకం,
- ఉత్తమ పర్యాటక గ్రామాలు - చైతన్యవంతమైన (వైబ్రెంట్) గ్రామాలు,
- ఉత్తమ పర్యాటక గ్రామాలు - అడ్వెంచర్ టూరిజం,
- ఉత్తమ పర్యాటక గ్రామాలు - కమ్యూనిటీ ఆధారిత పర్యాటకం,
- ఉత్తమ పర్యాటక గ్రామాలు - వెల్నెస్

ఉత్తమ గ్రామీణ హెూమ్‌స్టే క్లస్టర్ విభాగం ఒక నిర్దిష్ట గ్రామంలో ఉమ్మడి థీమ్‌ను తెలియజేయాలని, క్లస్టర్‌లో కనీసం 3 హెూమ్‌స్టేలు ఉండాలని అన్నారు. పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రతి విభాగంలో అత్యుత్తమ ఐదు హెూమ్‌స్టేలను గుర్తిస్తుందని చెప్పారు. పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన హెూమ్‌స్టేలకు మార్గదర్శకత్వం, మద్దతు, మరింత అభివృద్ధిలో సహకారం అందిస్తుందని చెప్పారు. గ్రామీణ హెూమ్‌స్టేల అభివృద్ధికి ప్రభుత్వ-ప్రైవేట్ సహకారాన్ని కూడా మంత్రిత్వ శాఖ ప్రోత్సహిస్తుందన్నారు. ఉత్తమ గ్రామీణ హెూమ్‌స్టే పోటీ మూడు దశల్లో - జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉంటుందని అన్నారు. ప్రతి విభాగంలో గరిష్టంగా 3 కేటగిరీల్లో మాత్రమే నామినేట్ చేయాలని స్పష్టం చేశారు. అర్హత ఆసక్తి గల సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయాలని, జాతీయ స్థాయిలో జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆయన కోరారు.

పోటీ ప్రధాన లక్ష్యాలు

గ్రామీణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, గ్రామీణ జనాభా సాధికారతలో పురోగతి, ఆకర్షణ సామర్థ్యాన్ని పెంపొందించడం. గ్రామీణ మార్పును ప్రోత్సహించడం, బహుళ-స్థాయి పాలన, సహకారాలు, కమ్యూనిటీ భాగస్వామ్యం బలోపేతం చేయడం, అనుసంధానం, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరులు అందుబాటు, పెట్టుబడిని పెంచడం, అభివృద్ధి, డిజిటలైజేషన్, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, విలువ ఆధారిత పెంపు, స్థిరమైన ఆహార వ్యవస్థలు పర్యాటకం మధ్య సంబంధాన్ని ప్రోత్సహించడం, సహజ, సాంస్కృతిక వనరుల పరిరక్షణను పెంచడం, వనరులను బాగా ఉపయోగించుకోవడానికి, ఉద్గారాలను, వ్యర్థాలను తగ్గించడానికి స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం, జ్ఞానం, సామర్థ్యాలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యాలు.

అర్హతా ప్రమాణాలు

తక్కువ జనాభా సాంద్రత 25వేలు నివాసులకు మించకూడదు. ప్రసిద్ధ ప్రదేశాలు, పర్యాటక ప్రదేశాలు లేదా ప్రకృతి దృశ్యాలకు నిలయంగా ఉండాలి. వ్యవసాయం, క్రాఫ్ట్, వంటకాలు మొదలైన వాటితో సహా సాంప్రదాయ కార్యకలాపాలను కలిగి ఉండాలి. ఆన్‌లైన్‌లో పూరించి సమర్పించిన దరఖాస్తులు మాత్రమే మూల్యాంకనం కోసం పరిగణించబడతాయనిస్పష్టం చేశారు. దరఖాస్తులు ఆంగ్ల భాషలో మాత్రమే ఆమోదించడం జరుగుతుందని అన్నారు.

మూల్యాంకన అంశాలు

ఈ పోటీల్లో మూల్యాంకనం ప్రధానంగా సుస్థిర అభివద్ధి లక్ష్యాలు ఆధారంగా సాంస్కృతిక, సహజ వనరులు, ఆర్థిక స్థిరత్వం, పర్యావరణ సుస్థిరత, పర్యాటకం ప్రాధాన్యత, ఆరోగ్యం, భద్రత, సాంస్కతిక వనరుల ప్రచారం - పరిరక్షణ, సామాజిక స్థిరత్వం, టూరిజం అభివృద్ధి ఆధారంగా ఇతర రంగాల అనుసంధానం, మౌలిక సదుపాయాలు - అనుసంధానం తదితర అంశాలు ఉంటాయి.

దర్యాప్తు చేస్తున్న విఆర్‌ఒ సూర్యప్రతాప్

బహిరంగ మార్కెట్‌లో ప్రజాపంపిణీ కందిపప్పు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని ఎమ్మార్‌నగరంలో ప్రజాపంపిణీకి చెందిన 21 పేకెట్ల కందిపప్పు గ్రామంలోని ఒక కిరణా షాపులో ఉన్నట్లు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. వీరి ఫిర్యాదు మేరకు విఆర్‌ఒ సూర్యప్రతాప్ కిరాణాదుకాణంలో కందిపప్పును స్వాధీనం చేసుకుని వివరాలు నమోదు చేసుకుని తహశీల్దారు కార్యాలయానికి నివేదిక అందించారు. రేషన్‌షాపు డీలర్ బుగత సంతోష్‌కుమార్ కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయకుండా పప్పుతో పాటు పంచదార, రేషన్ బియ్యం ఒడిషా తీసుకువెళ్లి అమ్ముకుని వినియోగదారులను దోచుకుంటున్నారని, అతనిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కరువు ప్రాంతాలుగా గుర్తించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కరువున బారినపడ్డ గిరిజన పంచాయతీలను వెంటనే అధికారులు పరిశీలించి కరువు ప్రాంతాలుగా గుర్తించి గిరిజన రైతులను అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నయా, కుంతేసు, పూడేసు, మసిమండ, పెద్దశాఖ, గుణదతీలేసు, కెమిశీల, చోలపదం, కుమ్మరిగుంట, పాలెం, వన్నాం, దేవకోన పంచాయితీల్లో గల కొన్ని గ్రామాల్లో 20 నుండి 30శాతం వరకే వరి పంట పండింది, తప్ప మిగతా 80 శాతం వరకు పంట వర్షాల్లేక ఎండిపోయిందని తెలిపారు. ఎండిపోయిన వరి చేలల్లో పశువులు మేపుకునే పరిస్థితి ఉందన్నారు. గడిచిన నెల రోజుల పాటు వర్షాల్లేకపోవడంతో నీరందక పంటలు ఎండిపోయాయన్నారు. సకాలంలో వర్షాల్లేకపోవడం వల్ల 80 శాతం వరి నష్టం జరిగిందన్నారు. కావున వెంటనే వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు గిరిజన పంచాయతీలకు వెళ్లి వరి పంటలను పరిశీలించాలని కోరారు. అనంతరం గ్రామాన్ని యూనిట్‌గా చేసుకొని కరువు పంచాయతీలుగా ప్రకటించి గిరిజన రైతులకు సబ్సిడీ రూపంలో విత్తనాలు, ఎరువులతో పాటు నష్టపరిహారం ఇచ్చి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో కె.సంగమ్మ, బి.చిలకమ్మ, రాము, వెంకటేశు, సుబ్బారావు, పోలయ్య, శుక్రు పాల్గొన్నారు.

నిడగల్లులో ప్రచారం చేస్తున్న పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాల టిడిపి నాయకులు

నిడగల్లులో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడిగళ్లులో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బేబినాయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు వేసి దుర్మార్గ పాలన చేస్తుందన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతుందని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని అన్నారు. పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడ్ని ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టిడిపి మండల నాయకులు కె.తిరుపతిరావు, ఆర్.వేణుగోపాలనాయుడు, బి.లక్ష్మణరావు, భగీరథ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన యువతను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మన్యప్రగతి చైర్మన్ రవి

ఏజెన్సీలో గ్రామదర్శిని

ప్రజాశక్తి - సీతంపేట

మన్య ప్రగతి ఆధ్వర్యాన మండలంలోని పోంగళంగూడ, సీది గ్రామాల్లో గ్రామదర్శిని కార్యక్రమం మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవి ఆదివారం నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. గిరిజన, సంస్కృతి - సంప్రదాయాలు పరిరక్షించుకోవాలని అన్నారు, గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రజలు సహకరించాలని అన్నారు. మానవ సంబంధాలపై 'గ్రామ దర్శిని -ద్వారా ప్రజా చైతన్య అవగాహనా నిర్వహించారు'.గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది - మహాత్మా గాంధీ స్ఫూర్తి తో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దమయంతి నాయుడు, యుగంధర్, ఆరిక కృష్ణ ఆరిక సురేంద్ర, నిమ్మక క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



మురడలో ప్రచారం చేస్తున్న డిసిసి అధ్యక్షులు సింహాచలం

గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన కాంగ్రెస్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని చెముడుగూడలో గడప గడపకు మన కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అడ్డంగూడ, మురడ, చెముడుగూడలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ సిద్ధాంతాలు, భావజాలాలు ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం అభ్యర్థించారు. స్థానిక ఎమ్మెల్యే గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన విభాగం అధ్యక్షులు కిల్లక రాఘవేంద్రరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మూటక లక్ష్మయ్య, రైతు, గిరిజన, బిసి విభాగాల అధ్యక్షులు గుమ్ముడు నాగేశ్వర రావు, బిడ్డిక సూర్యం, లాభాల గణేష్, నాయకులు పాపారావు, చందు ఉన్నారు.

ఘనంగా క్రైస్తవుల కానుకల పండగ

ప్రజాశక్తి - కురుపాం

క్రైస్తవుల కానుక పండుగను పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో గల రావాడ రోడ్డు సమీపాన గల గుడ్ సమారిటన్ లూథరిన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్. పి.జీవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. కానుకల పండగలో క్రైస్తవులు పెద్దఎత్తున కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు దోనక జాన్, దోనక రాజారత్నం, ప్రదీప్, కోట సుందర సుదర్శన్, జయకుమార్, మజ్జి బాబు, కోట ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో మంచి ప్రతి చూపాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి కోరారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం జాతీయ మహిళా దినోత్సవం, దిశ చట్టం, మహిళా సాధికారికతపై జరిగిన చర్చావేదికలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మావతి దిశా చట్టం వల్ల మహిళలకు జరుగుతున్న ప్రయోజనాలను వివరించారు. అలాగే దేశంలో మహిళలు సాధించిన విజయాలు, ఎవరెవరు ఉన్నత శిఖరాలను ఎలా అధిరోహించారో వివరించారు. అలాగే స్థానిక గ్రంథాయాలనికి ప్రహరీగోడ నిర్మాణానికి, పాఠకులు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక శాఖాగ్రంథాలయాధికారి ఉదయభాస్కర్‌తో పాటు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : 56వ గ్రంథాలయాలు వారోత్సవాలు సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహకులు డి. సుకన్య మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు ఒక గంట పాటు పుస్తక పఠనం చేయాలని కోరారు. చివర రోజున

పాలకొండ : ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది

విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ పద్మావతి

విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయబడుతుందని తెలిపారు.

వీరఘట్టం : స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చిత్రలేఖ నపోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. భారత తొలి ప్రధాని కీర్తిశేషులు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినాన్ని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భామిని : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరిన్ కె.సునీత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కెజిబివి, బాలయోగి, ఆదర్శ పాఠశాల విద్యార్థులు ముగ్గులు వేసి, విభిన్న రంగులు వేశారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఇ.సుజాత,రవణమ్మ పాల్గొన్నారు.

పాలకొండ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో పెద్దకాపు వీధి హైస్కూల్ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వెంకమ్మపేట హైస్కూల్, రోమన్ కాథలిక్ స్కూల్, పెదకాపు వీధి హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.పరాంకుశం నాయుడు, ఉపాధ్యాయులు జామి రవి, ఎ.సూర్యప్రభ, కె.నారాయణ రావు, కె.గడ్డియ్య, పి.ధర్మారావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్‌ఐగా నీలకంఠరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠా పురం ఎస్‌ఐగా నీలకంటరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై డి.అనిల్ కుమార్ దోనుబాయి బదిలీపై వెళ్లారు. సీతంపేట ఎస్‌ఐగా పనిచేస్తున్న నీలకంఠరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యత స్వీకరించిన అనంతరం నీలకంఠరావు మాట్లాడుతూ ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలకండ ప్రజలందరితో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

తాడికొండలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. మండల నోడల్ అధికారి ఎస్.సాల్మాన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తాడికొండ, లంబేసు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించారు. జెడ్‌పిటిసి రాధిక, సర్పంచులు జగ్గారావు వికసిత్ భారత్ సంకల్ప్ ప్రతిజ్ఞ చేయించారు. వ్యవసాయ పద్ధతులు, డ్రోన్ల వినియోగం, నిపుణులు అధికారులు వివరించారు. సెక్రటేరియట్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే లంబేసులో జరిగిన కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎం.గౌరమ్మ, సర్పంచ్ టి.సీతమ్మ, సచివాలయం, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది

మోకాళ్లపై నిరసన తెలిపిన టిడిపి, జనసేన నాయకులు

గుమ్మలక్ష్మీపురం : పెదమేరంగిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో రోడ్లు దుస్థితి సిఎం జగన్మోహన్ రెడ్డికి కనిపించలేదా అంటూ కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమంలో భాగంగా రెండో రోజు జియమ్మవలస మండలం పెదమేరంగి కూడలి వద్ద టిడిపి-జనసేన నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిపై ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కళ్లు తెరిచి చూడాలని సూచించారు. రోడ్లు పూర్తిగా పాడై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. అయినా ప్రభుత్వం ప్రమాదాల నివారణకు రోడ్లను మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ప్రధానంగా రహదారులపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని అన్నారు. వైసిపి కక్ష సాధింపు చర్యలు తప్ప రాష్ట్రానికి అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. రోడ్ల దుస్థితిపై పాదయాత్ర చేపట్టి మోకాళ్లపై వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ సంద్భంగా గుంతలను కప్పుతారా? రోడ్లు వేస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పల్లా రాంబాబు పలువురు టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

సాలూరు: వైసిపి పాలనలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి అన్నారు. ఆదివారం ఆమె విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ అభివృద్ధి పనులను పూర్తిగా ప్రభుత్వం విస్మరించిందని చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నియోజకవర్గంలో రోడ్లు గుంతలతో నిండి వున్నాయన్నారు. సాలూరు నుంచి మక్కువ రోడ్డు నిర్మాణ పనులు ఎన్నాళ్లు సాగిస్తారని ప్రశ్నించారు. వాహనదారులు ఆ రోడ్డు మీదుగా వెళ్లడానికి భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏజెన్సీ గ్రామాల కు రోడ్లు నిర్మిస్తామని చెప్పిన డిప్యూటీ మాట తప్పారని విమర్శించారు. పాచిపెంట మండలం శతాబ్ది, మూటకూడు గ్రామాలకు, సాలూరు మండలం డెన్నరాయి, సంపంగిపాడు గ్రామాలకు రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన రాజన్నదొర పట్టించుకోలేదని సంధ్యారాణి అన్నారు.

సీతంపేట : టిడిపి-జనసేన పార్టీల పిలుపు మేరకు తెలుగుదేశం నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమంలో భాగంగా ఆదివారం సీతంపేట మండలం కీసరజోడు, జరడ కాలనీల్లో రోడ్ల గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కీసరజోడు వద్ద రోడ్డు గోతులమయమవ్వడంతో పాటు కల్వర్టు కూడా మరమ్మతులకు గురయిందన్నారు. ఈ రహదారి గుండా 14 గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు భామిని మండల రైతులు కూడా రాకపోకలు చేస్తుంటారని రోడ్డు మరమ్మతుల వల్ల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే చినబగ్గ పంచాయతీ పరిధిలో ఉన్న జరడ కాలనీ రోడ్డు అధ్వాన్నంగా ఉందన్నారు. సీతంపేట మండలంలో అనేక గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కదిలి రహదారుల పనులు చేపట్టి నరకం నుంచి విముక్తి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆరిక మురళీ, పువ్వల ఖగేశ్వరరావు, తాడంగి కాళిదాసు, ఊయక ప్రసాద్, బాలరాజు, మీనక పగడాలమ్మ, తాడండి రత్నాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అని జనసేన నాయకులు ప్రశ్నించారు. ఆదివారం నాడు పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్, రాయగడ రోడ్డులో గోతుల వద్ద జనసేన నాయకులు నిరసన తెలిపారు. వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో కనీసం రోడ్లల్లో ఏర్పడ్డా గోతులను పూడ్చలేకపోయారని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. ఆదివారం ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, తామరఖండి తేజ, పసుపురెడ్డి పూర్ణచంద్ర ప్రసాద్ వి.సత్యనారాయణ తదితరులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు గోతుల వద్ద నిరసనలు తెలియజేస్తూ డిజిటల్ క్యాంపెయిన్ చేయడం జరుగుతుందన్నారు. రాయగడ రోడ్డులో ఉన్న గోతులతో పాటు డంపింగ్ యార్డ్ వద్ద ఏర్పడిన గోతుల్లో పలువురు వాహనచోదకులు ప్రమాదం బారిన పడ్డారన్నారు. తరచూ ఈ ప్రాంతంలోని గోతుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినప్పటికీ సంబంధిత పాలకుల్లో, అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో కనీసం రోడ్లు గోతులు పూడ్చలేని దుస్థితిలో పాలన చేసిందని, కాబట్టి ప్రజలు వైసిపి చేస్తున్న అస్తవ్యస్త పాలనను గమనించాలన్నారు. రోడ్లు గోతులు పూడ్చలేని చేతకాని ప్రభుత్వం ప్రజా పాలన ఏవిధంగా చేస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, మౌలిక సదుపాయాల్లో ఒకటైన రోడ్డు సదుపాయం కల్పించలేకపోయారని అన్నారు. అంతర్రాష్ట్ర ఒడిస్సా రహదారి పరిస్థితి దారుణమన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు కళ్లు తెరచి ఆయా రోడ్డులో ఏర్పడిన గోతులను పూడ్చి ప్రమాదాలను నివారించాలని కోరారు.

సింహాచలం నాయుడు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో నెలకొల్పిన జ్ఞాన జ్యోతి గ్రంథాలయంలో 13 ఏళ్ల నుంచి జీత భత్యాలు లేకుండా కేర్ టేకర్‌గా పని చేస్తున్న డి.సింహాచలంనాయుడుకు గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నూతన వస్త్రాలు, రూ.5వేలు నగదు పురస్కారంతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి.శివ కేశవరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో సేవ చేయడం దేవుని సేవ కంటే గొప్పదన్నారు. ఏ స్వలాభం ఆశించకుండా దీర్ఘకాలం పాటు వాలంటీర్‌గా పనిచేసిన సింహాచలం నాయుడు సేవలను కొనియాడారు. గ్రంథాలయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తోటపల్లి గ్రామ పెద్దలు, రచయితలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని ఆదుకున్న పెద్దమనసు

విద్యాదాతగా మారిన వైద్యుడు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పిల్లల భవిష్యత్తు కోసం దాచుకున్న లక్షల రూపాయల నగదు చెదలపట్టి పనికి రాకుండా పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక కుటుంబాన్ని తనకు ఏమీ సంబంధం లేకపోయినా సోషల్‌మీడియాలో విషయం తెలుసుకున్న ఒక పెద్దమనిషి పెద్ద మనసుతో ఆదుకుని ఆ కుటుంబానికి రూ.2లక్షలు సాయం అందించిన సంఘటన పార్వతీపురం మండలం పుట్టూరులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పుట్టూరుకు చెందిన ఆదిమూలం లక్ష్మణరావు దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొద్దిరోజులు క్రితం 14ఏళ్ల వయసు గల తన కుమారుడు, డాబా నుండి కిందపడిపోయి మరణించారు. 7,3 తరగతులు చదువుతున్న తమ కుమార్తె చదువు నిమిత్తం నగదురూపంలో ఇంట్లోని చెక్కపెట్టెలో దాచుకోగా, లక్షరూపాయల నగదును చెద్దలు కొట్టేయడంతో గుండెలు అవిసేలా రోధించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న డాక్టర్ రఘురామ్ అనే వైద్యుడు ఆ కుటుంబ వివరాలు కనుక్కుని ఆపేద దంపతుల బ్యాంకు ఎకౌంట్‌లో రెండులక్షల రూపాయలు ఆడపిల్లల చదువుల నిమిత్తం డిపాజిట్ చేసి తన ఔదర్యాన్ని చాటుకున్నారు. వైద్యుని పెద్ద మనసుకు ఆ కుటుంబంతో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విరాళం అందజేసిన డాక్టర్ రఘురాం

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు కూడా వేగవంతమయ్యాయని వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి చెప్పారు. పట్టణంలోని 8వ వార్డు కొంకివీధిలో రూ.పది లక్షలతో నిర్మించనున్న రోడ్లు, పైలట్ వాటర్ స్కీంలకు ఆమె భూమి పూజ చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతిపాదించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జర్జాపు దీప్తి

మిర్తివలసలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మిర్తివలసలో పంట కోత ప్రయోగం కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్ ఆదివారం నిర్వహించారు. మిర్తివలసలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గుణపర్తి గోవిందరావు రైతు సాంబమసూరి వరి పొలంలో మండల గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో ఎంసిఆర్ పి.లక్ష్మి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగంలో ఎకరాకు 29 బస్తాలు వచ్చినట్లు ఎఓ శ్రవణ్ కుమార్ నిర్ధారించారు. వర్షాధారం కాకుండా పూర్తిగా నీటి సదుపాయం ఉన్నట్లయితే ఇంకో రెండు మూడు బస్తాలు పెరిగేవని రైతులకు వివరించారు. అలాగే రైతు దమ్ముకు ముందు పచ్చిరొట్ట ఎరువులు వేసి దమ్ములో కలియ దున్నడం వల్ల ఎరువులు వాడకం లేకపోయినప్పటికీ రసాయన రైతులతో పాటు సమానంగా దిగుబడి వచ్చిందని వివరించారు. ఇక్కడ రైతులు పెట్టుబడి ఖర్చుల వ్యత్యాసాన్ని గమనించాలని సూచించారు. రైతు గోవింద మాట్లాడుతూ తను గత రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు, వరి పంటకు ముందు నవధాన్యాలు చల్లడం, 400కేజీల ఘనజీవామృతాన్ని, 400లీటర్ల ద్రవ జీవామృతాన్ని, వంద లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని ఎరువులు నిమిత్తము ఉపయోగించినట్టు తెలిపారు. తెగుళ్ల నివారణకు నీమాస్త్రాన్ని, తూటి కాడ కాషాయాన్ని మాత్రమే వాడానని, దిగుబడి మిగిలిన రైతులతో సమానంగా వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎఎబి చైర్మన్ గుడుపూరు గంగయ్య, సర్పంచ్ దూడు భాస్కర రావు, విఎఎ ప్రశాంతి, ఐసిఆర్‌పి తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో బస్‌షెల్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన గ్రామ పెద్దలతో పాటు యువకులు ముందుకొచ్చి కొంత విరాళాలను సేకరించి గ్రామంలోని బస్సు షెల్టర్ నిర్మాణ పనులు చేపట్టేందుకు గ్రామస్తులు ఆదివారం భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల మహేష్ మాజీ సర్పంచులు వెంకటరమణ, గీత నందీశ్వరరావు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి కి గాయాలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని దత్తవలస వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఆటో బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న జె.బంగార్రాజుకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పి.కృష్ణారావు నిర్లక్ష్యంగా ఆటోను వేగంగా నడిపారని రూరల్ ఎస్‌ఐ ప్రయోగ మూర్తి చెప్పారు. సంఘటనపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ తగిలి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తాకడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా దత్తిరేజేరు మండలం ఇంగిలాపల్లికి చెందిన నడుకూరి సత్యనారాయణ వ్యక్తి రహదారులపై ప్లాస్టిక్ సీసాలను ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సీసాలు ఏరుకుంటూ స్థానిక పాత బస్టాండ్ శివారు సెయింట్ పీటర్ స్కూల్ ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫుర్మర్ దగ్గరపడి ఉన్న ప్లాస్టిక్ వస్తువులను ఏరుకునే ప్రయత్నం చేయగా విద్యుత్ వైర్లు తగిలి ఒళ్లంతా కాలిపోయి ప్రమాదానికి గురైయ్యాడు. స్పందించిన స్థానికులు సప్లై నిలుపుదల చేసి, బాధితున్ని 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S.No.4/2023

Between:
ఇండుపూరి వెంకట రాజు ....వాది
And:
మండవిల్లి సోమ శేఖర్ ......ప్రతివాది

నోటీసు

ప్రతివాది:- మండవిల్లి సోమ శేఖర్, తండ్రి వెంకట రాజు, గొర్లే వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై పై కోర్టులో దావా సొమ్ము రాబట్టు నిమిత్తము దావా వేసియున్నారు. సదరు దావా **తేదీ:20-11-2023**న శ్రీ కోర్టువారు వాయిదా వేయింపించియున్నారు. వాయిదా దినం **ఉదయం 10.30 గంటల**కు మీరు గాని, మీ వలన ఆర్డరు పొందినవారు గాని, మీ తరుపున ప్లీడరుగారు గాని, పై కోర్టులో హాజరు అయ్యి మీ తరుపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానము జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

గొర్లే కిరణ్ కుమార్,
వాది తరుపు న్యాయవాది,
సాలూరు,
సెల్: 99632 65374,

సాలూరు,
తేదీ: 18-11-2023